

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# ఆ ఆర్తనాదం నాదే...

కోర్టుహాలు నిశ్శబ్దంగా ఉంది. అయినా జడ్డి అడిగిన ప్రశ్నలు ఆశాలతకు వినిపించటం లేదు. బోనులో నిలబడ్డ ఆమె కళ్లకేమి కనిపించటం లేదు. చెవులకేమీ వినిపించటంలేదు. నిర్లిప్తంగా చూస్తోంది. మొహం మీద కాలంగీసిన గీతలు ఆమెకు అకాల వార్ధక్యాన్ని తెచ్చిపెట్టాయి.

"నీవు హత్య చేసినమాట నిజమేనా?" అని జడ్జి మళ్లీ అడిగాడు. ఆలోచనాలోచనాల్లో నుంచి ఆశాలత జడ్జి వైపు దృష్టి సారించింది.

"నాకు మరణ శిక్ష విధించండి. వీలైనంత త్వరగా నన్ను ఉరితీయండి..." అన్నది.

"నీకు ఏ శిక్ష విధించాలో నిర్ణయించాల్సింది నేను. అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పు◌ు" అన్నాడాయన. "ఏం అడిగారు?" అన్నది ఆశాలత అప్పుడే నిద్రలోనుంచి మేల్కొన్నట్లు.

"నువ్వు హత్య చేశావా?"

"చేశాను"

"ఎందుకు చేశావు"

"ఏమీ తోచక..."

"ఇది కోర్టు. ఇక్కడ హాస్యాలూ, పరిహాసాలూ పనికిరావు" అడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పు... ఎందుకు హత్యచేశావు?"

"అదొక పెద్ద కథ. చెప్పే ఓపిక నాకు లేదు. వినే తీరిక మీకులేదు..."

"హత్యకు దారితీసిన కారణాలూ రికార్డు చేయాలి. అందుచేత ఆ కథ నువు చెప్పకాతప్పదు. నేను వినకాతప్పదు..."

ఆశాలత దీర్ఘంగా నిశ్వసించింది. గ్లాసుతో మంచి నీళ్లు తెప్పించుకుని తాగి, ఆ కథ చెప్పటం మొదలెట్టింది.

-----

అదొక ఎదిగీ ఎదగని పల్లెటూరు. వాళ్లంతా ఎదిగీ ఎదగని మనుషులు. జరుగుబాటు ఉన్నవాళ్లు పదిశాతం మంది అయితే, తిండికి లేనివాళ్లు తొంభైశాతం మంది. ఈ తొంభైశాతం మంది ఆ పదిశాతం మందికీ అడుగులకు మడుగులొత్తుతూ బతకాల్సిందే.

ఆ అమ్మాయి నిరుపేద ఇంట్లో దురదృష్టమనే పేగును మెడను వేసుకుని పుట్టింది. ఏడాది తిరగకముందే తండ్రి చనిపోయాడు. కన్నీటి తడి ఆరకముందే తల్లి ఒక మోతుబరి ఇంట్లో పనికి కుదిరింది. ఆ తల్లి ఆశలన్నీ కూతురుమీదే. చంద్రబింబంలా ఎదుగుతున్న కూతుర్ని చూసుకుని తనకష్టాలు మర్చిపోయేది. మిగతా అన్నింట్లో వెనకబడే ఉన్నా ఆ పిల్ల చదువులో అందరికన్నా ముందుండేది. స్కూల్లో టీచర్లు మెచ్చుకునే వాళ్లు. ఇరుగు పొరుగు ఈ చదువుల సరస్వతిని అడిగేవాళ్లు పెద్దయ్యాక నువ్వేమవుతావే? అని "నేను డాక్టరు అవుతా" అనేదా పిల్ల. భవిష్యత్తు. మీద బోలెడంత భరోసాతో. "వామ్మో, నువు డాక్టరయ్యాక సూరమ్మత్తకు డబ్బులు తీసుకోకుండా పెద్దాపరేషను సేత్తావా?" అని అడిగేది పొరుగింటామె.

'అట్టాగే' అనేదా అమ్మాయి.

అందమైన లేత కలల వర్షంలో తడుస్తూనే ఆ అమ్మాయి అరుగుమీద బొంగరాలు తిప్పుతూ, బాల్యాన్ని గడిపేసింది. యవ్వనంలోకి తొంగిచూస్తోంది.

స్కూలు ఫస్టువచ్చింది. ఆ విషయం తల్లికి చెప్పేందుకు పరుగుపరుగున వచ్చింది తల్లిని వెతుక్కుంటూ. 'మీ యమ్మ ఇంట్లో నేదు. మీ యమ్మ కాడికి నే తీసుకెల్తారాయే' అంటూ ఎంకటేసు ఆ అమ్మాయిని ఏపుగా ఎదిగిన పంట పొలంలోకి తీసుకెళ్లాడు.

తనువూ మనసూ, వయసూ– వీటికి అర్థాలే తెలియని గులాబీ మొగ్గలాంటి అమ్మాయిని ఆ రాక్షసుడు తన కబంధ హస్తాల్లో బంధించి నలిపేస్తుంటే, ఉక్కిరిబిక్కిరై పోయి, ప్రాణభయంతో కెవ్వున అరిచిన అరుపు ఆ చేల మధ్య చెట్ల మధ్యా ప్రతిధ్వనించింది....

ఆ ఆర్తనాదం నాదే....

ఆ ముష్కరుని అఘాయిత్యానికి బలయి, చీలికలు పేలికలైన దుస్తులతో గాయపడిన అభిమానాన్నీ, మానాన్నీ దాచుకోలేక, రక్తాశ్రువులతో కొంపచేరిన ఆ పిల్లను చూసి అందరూ తలోమాటా అన్నారు.

'ఆడికేంటి అచ్చోసిన ఆంబోతు, ఈ ఇసయం నలుగురు నోట్లల్లో పడితే, దీని బతుకే బుగ్గయిపోతది' అన్నారు అందరూ. ఆ పిల్ల ఆశలూ, ఆశయాలూ, కలలూ, కలవరింతలూ– అన్నీ అలా హరించుకుపోయాయి.

"సదివింది సాల్లే తల్లీ... ఎదిగిన పిల్లవు తల్లికి సేదోడు వాడోదుగా ఉండు' అని హితువు చెప్పారు.

తల్లి ఆరోగ్యం దెబ్బతిన్నది. తల్లి పనిచేసే మునసబుగారింట్లో పనిచేయటానికి వెళ్ళిందా అమ్మాయి. వంచిన తలెత్తకుండా ఇంటెడు చాకిరీ చేసుకుపోతున్న ఆ అమ్మాయి ఇంట్లో అందరికి నచ్చింది. మునసబుగారి రెండో కొడుక్కి మరింత బాగా నచ్చింది. చీటికీ మాటికీ తన గదిలోకి పిలిపించుకునేవాడు– ఏదో ఒక వంకతో. ఆ అమ్మాయి ఏమీ మాట్లాడేది కాదు. కానీ వయసే వయసును పలకరించేది. ఆమె మీద కథలు రాసేవాడు. కవితలు రాసేవాడు. కళ్లల్లో కళ్లు కలిపేవాడు. చేతిలో చెయ్యి వేసేవాడు. ప్రజెంటేషన్స్ ఇచ్చేవాడు.

'నేను పనిమడిసిని బాబూ. మీకు సేవ సేయటానికొచ్చాను' అనేదా అమ్మాయి. 'నాకు పర్మినెంటు పనిమనిషిగా ఉండిపోమ్మంటున్నాను. నీకు భార్యగా ప్రమోషన్ ఇస్తాను. ఆ తరువాత మనిద్దరం ఎవరికెవరు ఎన్ని సేవలైనా చేసుకోవచ్చు' అనేవాడు ఆమె భుజాల మీద చేతులువేసి.

ప్రేమ అనేది ఓ ఇంద్రజాలం. సకలేంద్రియాలనూ సమ్మోహనం చేస్తుంది. ఆ సమయంలో ఏం చేస్తున్నారో వాళ్లకే తెలియదు. ఆ ఊళ్లో వాళ్ల ఆటలు సాగవని తెల్సి సిటీకి పారిపోయారు. నెలరోజులపాటు ఆనందోత్సాహాలతో రస తరంగిణులపైన పయనిస్తూ జీవనోత్సవాన్ని తిలకించారు. ఆ పారవశ్యంలో ఉండగానే, ఆ ఊరివాళ్ల కంటబడ్డారు.

మునసబుగారు ఇద్దర్నీ ఊరికి లాక్కొచ్చారు. అబ్బాయిని గదిలో బంధించారు. ఆ అమ్మాయిని చెట్టుకు కట్టేసి, వలువలు విప్పేసి, నోటి కొచ్చినట్లు తిడుతూ, వాతలు తేలేలాగా కొట్టారు. బాధకు తట్టుకోలేక ఆ అమ్మాయి కెవ్వుమని అరిస్తే, ఊరుఊరంతా ప్రతిధ్వనించింది.

ఆ ఆర్తనాదం నాదే...

అందరు నివ్వెరపోయి చూశారే తప్ప 'అదేమిటని' అడిగే ధైర్యం ఎవరికీ లేకపోయింది. ప్రేమ నేరమౌనా? అవును. అంతరాలు మరిచి ప్రేమిస్తే అది నేరమే అవుతుందని మరోసారి రుజువైంది.

ఆ గోల సద్దుమనగటానికి ఆర్నెల్లు పట్టింది. ఆ అమ్మాయి నాలుగు గోడలూ దాటి బయటకు రాలేకపోతోంది. తల్లి కూడా ఆమెను అన్యాయం చేసి వెళ్లిపోయింది. శిథిలమైన పూరికొంపలో ఆ అమ్మాయి ఒక్కతీ ఎలా ఉంటుందో ఏం తింటుందో పట్టించుకున్నవాడే లేనప్పుడు, ఎదురింటి అడుగుమీద మిషన్ కుట్టే సాయెబు ఒక్కడే ఆమెను పలకరించే దిక్కు. అయ్యాడు.

''ఈ ఊళ్లో తప్పు చెయ్యనివాడెవుడున్నాడు? వాళ్లంతా పెద్దమనుషులే అయినప్పుడు, నువు సెడ్డదానివి ఎలా అయ్యావు? ఈ ఊరు నిన్ను వెలేసింది. కానీ ఇదే ప్రపంచం కాదు. ఈ ఊరిపొలిమేరలు దాటి వెళ్తే బయట బోలెడంత మంది మనుషులు.... సిటీలో నాకు తెల్సినామె నీలాంటి వాళ్లకోసం ఆశ్రమం నడుపుతోంది. అక్కడ నీకే లోటూ ఉండదు....' అని హితువు చెప్పాడు.

ఆమె వరదలో కొట్టుకుపోతోంది. మునిగిపోతోంది. ఆ సమయంలో ఓ గడ్డిపోచ దొరికింది... సాయెబుతో సిటీకి వచ్చింది. తను ఆమెను దమయంతి దగ్గరకు తీసుకెళ్లాడు. కథంతా చెప్పాడు.

'నూతిలో కప్పలా అక్కడే పడిఉంటే బతుకు లేదు. అక్కడ నుంచి బయటపడి మంచిపని చేశావు. గతాన్ని మర్చిపో. రేపటి నుంచీ నువ్వు కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నావు. ఇది మహానగరం, ఇక్కడ బాగుపడటానికి ఎన్ని మార్గాలున్నాయో, చెడిపోవటానికీ అన్ని మార్గాలున్నాయి. ఏ మార్గం అవలంబించాలన్నదే మనం నిర్ణయించుకోవాలి...'

అని ధైర్యం చెప్పింది దమయంతి.

సాయెబు వెళ్లిపోయాడు.

దమయంతి అసలురూపం నాలుగురోజుల తరువాత బయటపడింది. అదొక వ్యభిచారపు కొంప అని తెల్సి ఆ అమ్మాయి మనసు క్షోభించింది. పెనం మీదనుంచి గెంతి పొయ్యిలో పడ్డట్లు అయింది.

తనువూ మనసూ తీవ్రంగా గాయపడ్డాయి. ఆ గాయాలు మానక ముందే రోజూ... ఈ రంపపుకోత, నరకయాతన ఎలా భరించదగలదు? ఎదురుతిరిగింది. ఎవడో వచ్చి గదిలోకి నెట్టి వాతలు తేలేటట్లు కొట్టాడు. భరించలేని వేదనతో నిస్సహాయంగా కెవ్వుమని అరిచింది...

ఆ ఆర్తనాదం నాదే..

జీవనపోరాటంలో మరోసారి ఓడిపోయింది. కానీ ఈ ఓటమి మరింత వేదనాభరింతగా ఉంది. ఇష్టంలేనివాడు మనకు ఎదురుపడితేనే మొహం చిట్లించుకుంటాం. పరాగ్గా ఉన్నప్పుడు పరాయి వాడి కాలుతగిలినా, చెయ్యితగిలినా చిరాకుపడతాం... అలాంటిది ఎవరో కామాంధుల చేతుల్లో నలిగిపోతూ... కొవ్వొత్తిలా కాలిపోతూ... ఎంత ఏవగింపు? ఎంత అసహ్యం?...

దిక్కులేని వారికి దేవుడే దిక్కు అంటారు. ఆయన ఒక తలుపుమూసేసినా మరో తలుపు తెరుస్తాడని అంటారు. అలా మరో తలుపు తెరుచుకుని వచ్చిన వ్యక్తి ప్రకాశరావు.

అతను వీలున్నప్పుడల్లా వచ్చేవాడు. గంటలకొద్దీ ఆమెను పక్కన కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పేవాడు. ఆమెను ప్రేమిస్తున్నానని చెప్పేవాడు 'ప్రేమ' అంటేనే ఆమెకు భయం పట్టుకుంది. ఆ మాట వింటేనే ఉలిక్కి పడుతోంది. 'చదువు, ఉద్యోగం, గౌరవం– అన్నీ ఉన్నవారు. కావాలనుకుంటే మీకు సరితూగగల గౌరవ కుటుంబాల్లోని అమ్మాయిలెందరో మిమ్మల్ని ప్రేమించగలరు. పెళ్లిచేసుకోగలరు. వాళ్లందర్నీ వదిలి, నావంటి దురదృష్టవంతురాలినీ, విధివంచితురాలినీ వలచే ఖర్మ మీకెందుకు?అని అడిగింది.

కావాలని ఏ ఆడపిల్లా ఈ మురికి కూపంలోకి అడుగు పెట్టదు. పరిస్థితుల ప్రభావంతో గతిలేక ఇక్కడ రోజులు వెళ్లబుచ్చుతున్న నీలాంటి ఒక స్త్రీకి విముక్తి కలిగించినా ఈ జన్మధన్యమైపోతుంది. జీవితంలో ఎవరికి ఎవరు ఎప్పుడు తారసపడతారో తెలియదు. నిన్ను మొదటిసారి చూసిన క్షణంలోనే నీ మీద నాకు అభిమానం ఏర్పడింది. నిన్ను నా ఆరాధ్య దేవతగా భావిస్తున్నాను. నీ మనసునిండా పరిమళించే మంచితనం, నీ కళ్లల్లో తొణికిసలాడే కారుణ్యం నన్ను కట్టిపడేశాయి. తెగిపోయిన ఈ హృదయవీణను సవరించి, అనురాగ గీతాలను ఆలపించే అదృష్టాన్ని నాకు కలిగించు నువు కాదంటే నేను జన్మంతా బ్రహ్మచారిగానే ఉండిపోతాను...' అనేవాడు.

ఒకరోజు కాదు ఒకనెల కాదు, రెండేళ్ల పాటు అతను ఇదే అభ్యర్థనతో ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాడు. మొదట్లో కాదన్నా అతని మొండి పట్టుదల వల్ల క్రమంగా కరిగిపోయింది.

తనకూ ఒక ఇల్లు, భర్త సంసారం, పిల్లలూ– అందమైన అపురూపమైన దృశ్యాలన్నీ కళ్లముందు మెదిలేవి. అందని స్వర్గం ఆమెకు చేరువయ్యేది.

'ఒక ఇంటి ఇల్లాలిగా నిండుగా తృప్తిగా జీవించాలన్న ఆశ లేక కాదు. కానీ ఎదురైన ప్రతి వ్యక్తీ మోసం చేస్తుంటే, మనుషుల మీదే నమ్మకం పోయింది' అన్నదామె.

'నన్ను నమ్ము– నీ జీవితంలో మళ్లీ వసంతం విరబూస్తుంది' అన్నాడు. ఆమె నిట్టూర్చింది అంగీకరించింది.

ప్రకాశరావు ఆమెను పంజరంలో నుంచి బయటకు తీసుకెళ్లాడు. ఆనందంతో రెక్కలు రెపరెప లాడించిన పక్షిలా రెండు చేతులూ చాచి గిరగిరతిరుగుతూ చిన్న పిల్లలా సంతోషంగా పరుగులు తీసింది. అయిదో అంతస్థులో ఫ్లాట్ అద్దెకు తీసుకున్నాడు.

ప్రకాశరావు ఆమెను గుళ్లో పెళ్లి చేసుకున్నాడు. మెడలో మంగళసూత్రం... కొత్తగా, వింతగా ఉంది. తెగిన గాలిపటంలా ఎటో కొట్టుకుపోయి ఏ తాటిచెట్టు మట్టలోనో చిక్కుకుపోయి, చిరిగిపోయే తన జీవితానికి ఒక అర్థాన్నీ పరమార్థాన్నీ కల్పించాడు వెలయాల్ని, వివాహబంధంతో ఆలిని చేసుకున్నాడు. ఏ సంఘ సంస్కర్తా చేయలేని గొప్ప పనిని అతి నిరాడంబరంగా చేసి చూపించిన ప్రకాశరావు ఆమెకు దేవుడికన్నా మిన్నగా కనిపించాడు.

'ఒక చరిత్రహీనురాలిని తీసుకొచ్చి ఇంత ఉన్నతస్థానంలో నిలబెట్టారు. మీ రుణం ఎలా తీర్చుకోగలనూ?' అన్నదామె భర్త కౌగిట్లో కరిగిపోతూ.

గతాన్ని పీడకలలా మర్చిపోయేందుకు ప్రయత్నిస్తోంది. భవిష్యత్తు గురించి సుందర స్వప్నాల్ని కంటోంది. భార్యగా, ఒక ఇల్లాలిగా గుర్తింపు లభించింది. ఇది అనుకోని వరం...

ఇప్పుడామె దృష్టి అంతా మాతృత్వంవైపు మళ్లుతోంది. పండంటి పాపాయి కోసం కలలు కంటోంది.

ప్రకాశరావు ఎందుకో అస్యమనస్కంగా ఉంటున్నాడు. ఆమె కారణం తెల్సుకుంది. అప్పుల్లో ఉన్నాననీ, వాటిల్లో నుంచి బయటపడేమార్గం తోచటం లేదని చెప్పాడు. అంతకు ముందు చెప్పినవన్నీ అబద్ధాలే. అతనికి పెద్దగా చదువు లేదు. ఉద్యోగం లేదు. ఆస్తిపాస్తులు అంతకన్నా లేవు. కానీ షోకులకూ, సరదాలకూ, విలాసాలకూ లోటులేదు.

ఆమె ఉద్యోగం చేయక తప్పదన్నాడు. ఒక హొటల్లో రిసెప్షనిస్ట్‌గా చేర్చాడు. వారం తిరగక ముందే ఆమెను ఆ హోటల్లో సెక్స్ డ్యాన్సులు చేయమన్నాడు. ఆమె ఒప్పుకోలేదు. అతడు ఒప్పుకున్నాడు.

ఆ వెధవ ఉద్యోగం మానేస్తానంది. చంపేస్తాననీ కత్తితీసి బెదిరించాడు. ఆ రోజునుంచీ ప్రతిరోజూ బెదిరింపులే. అనుక్షణం చస్తూ బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రకాశరావు దగ్గరుండి భార్యను తీసుకెళ్లేవాడు. అర్థరాత్రిదాకా చిందులు ఆపైన ఎవడడెవడితోనే విందులు.. పొందులు...

ఆమె ఆశలు మరోసారి అడియాసలయ్యాయి. అందమైన కలలన్నీ మళ్లీ బుగ్గిపాలయ్యాయి.

భార్యగా మారినందువల్ల ఆమె సౌందర్యాన్నీ, శరీరాన్ని పణంగా పెట్టి ప్రకాశరావు వేలకువేలు సంపాదిస్తున్నాడు. నోరెత్తితే చాలు చంపేయటానికి సిద్ధంగా ఎప్పుడూ కత్తి దగ్గరే ఉంచుకుంటాడు.

అతని అప్పులు తీరిపోవటమేకాదు. ఆస్థులు కొనటమూ మొదలేట్టాడు. ఖరీదైన ఇల్లు కొన్నాడు. కారు కొన్నాడు. కనిపించని బిజినెస్ లెన్నో చేస్తున్నాడు. అయినా భార్యను ఆటబొమ్మను చేసి ఆడించటం మానలేదు.

ఆమె మానసికంగా శారీరకంగా కుంగిపోయింది. అయినా అతను పట్టించుకోలేదు.

భర్తకదా... ఆమె మీద అతనికి హక్కులున్నాయి. తెలియక ఒకప్పుడు ఆ హక్కులు ఆమె అతనికిచ్చింది

ఒకరోజు అర్థరాత్రి చెవులు బద్దలైపోయేలా మోగుతున్న వాయిద్యాల లయకు అనుగుణంగా గెంతుతూ అక్కడే కుప్పలా కూలిపోయింది. నెత్తురు కక్కుకుంది.

డాక్టర్లు ఎయిడ్స్ అన్నారు.

ఇంట్లో నుంచి బయటకు నడవమన్నాడు భర్త. అది ఎవరి ఇల్లు? ఎవరి రక్తమాంసాలు ధారపోసి కొన్నదీ మేడ? ఎదురు ప్రశ్నించి నందుకు చంపుతానన్నాడు. మెడబెట్టి గేటు బయటకు గెంటాడు.

ఆమె గుండె మండిపోయింది అర్థరాత్రి... నింగీనేలా నిద్రపోతున్నప్పుడు ఆమె ఆ ఇంట్లోకి ప్రవేశించింది. ఆ ఇంట్లోనుంచి కెవ్వున కేక వినిపించింది. ఆ ఆర్తనాదం మాత్రం నాది కాదు..."

ఆశాలత చెప్పటం ముగించింది.

కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె ఆరోగ్యం కోలుకున్న తర్వాతే శిక్ష అమలు జరపాలి. అంతకు ముందు ఎవరెవరో విధించిన శిక్షల వల్ల క్షణం క్షణం క్షీణిస్తూ... మృత్యువు ఒడిలోకి ఒరుగుతోంది. మృత్యువు కోరల్లో నుంచి ఆమె బయటపడేదీలేదు. కోర్టు శిక్ష అమలు జరిగేది లేదు.

★★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.